# వింత లేఖ

-దిట్టకవి శ్రీనివాసాచార్య



హైదరాబాద్‌లో అదొక హెడ్ పోస్టాఫీస్. కష్టమర్స్‌తో కళకళలాడుతోంది ఆఫీస్. క్లాస్‌ఫోర్ ఉద్యోగి అనుకుంటా అప్పుడే పోస్ట్‌బాక్స్ తెరచి లెటర్స్‌ని బస్తాలో వేసుకుని లోపలికి తెచ్చి బస్తా కుమ్మరించాడు ఆఫీసులో.

వెంటనే స్టాంపింగ్ జరిగింది.

వెనువెంటనే సార్టింగ్ మొదలైంది. సార్టింగ్ చేసే వ్యక్తులు బాగా అనుభవం ఉన్నవాళ్ళల్లే ఉన్నారు. ఏ మాత్రం పొరబడకుండా ఏ బాక్స్‌లో పడాల్సిన లెటర్స్‌ని ఆ బాక్స్‌లోనే వేస్తున్నారు అతి వేగంగా.

ఈ నేపథ్యంలో సార్టింగ్ చేసే వ్యక్తి దృష్టి ఒక కవర్‌మీద పడింది. ఆ కవర్ మీద అడ్రస్ సరిగా లేదు. ఆ కవర్ మీద దేవనాగరలిపిలో 'నీతవంతః భారతదేశమ్' అని ఉంది. దేవనాగరలిపి హిందీ లిపి కాబట్టి చదవగలిగాడు. అయితే రాష్ట్రం, జిల్లా, ఊరు ఏదీ లేదు. భారతదేశంలో దాన్ని ఏ రాష్ట్రానికి పంపాలో అతనికి అర్థం కాలేదు. తన పై అధికార్లకు చూపించాడు. వాళ్లకూ ఏం చెయ్యాలో బోధపడలేదు. చివరకు దాన్ని హెడ్ పోస్ట్‌మాస్టర్ దగ్గరికి తీసుకువెళ్లారు.

ఆయన దాన్ని చూసి "ఒక పనిచేయండి. జంటనగరాలలో అంతటా వెదకండి. ఎక్కడైనా నీతిపరుడు కనిపిస్తాడేమో గాలించండి" అని ఒక ఉచిత సలహా ఇచ్చాడు.

అలాగే జంటనగరాల్లో గాలించారు. కానీ నీతిమంతుడు ఎక్కడా తగల్లేదు వాళ్లకు. దాన్ని మళ్ళీ పోస్ట్‌మాస్టర్ దగ్గరకు తీసుకువచ్చారు.

"అయితే పక్క జిల్లాకు పంపండి" అన్నాడు ఆయన.

"అలాగే!" అంటూ వాళ్ళు దాన్ని పక్క జిల్లాకు పంపారు. అక్కడా నీతిమంతుడు దొరక్కపోవడంతో వాళ్ళు దాన్ని పక్క జిల్లాకు పంపారు. ఈ విధంగా ఆకవర్ ఆంధ్రలోని అన్ని జిల్లాలు తిరిగి చివరకు మళ్లీ హైదరాబాద్ పోస్ట్‌మాస్టర్ జనరల్‌కు చేరింది. ఆయన ఆ వింత కవర్‌ని అటూ ఇటూ తిప్పి చూసి "సరే! భారతదేశంలో అక్షరక్రమంలో మొదటిదైన అరుణాచల్‌ప్రదేశ్‌కి పంపండి" అన్నాడు. పోస్టల్ అధికారులు అలాగే అంటూ దాన్ని ఈటానగర్‌కు పంపారు.

ఈటానగర్ హెడ్ పోస్టాఫీస్‌లో ఆకవర్ మీది అడ్రస్‌తో సమస్య వచ్చి పడింది. వాళ్ళూ అరుణాచల్‌ప్రదేశ్ అంతటా వెదికారు. అక్కడా వాళ్లకు నీతివంతుడి అడ్రస్ దొరకలేదు. చేసేది లేక వాళ్ళూ దాన్ని అక్షరక్రమంలో రెండోదైన అస్సాం రాష్ట్రానికి పంపారు. ఆ కవర్ డిస్‌పూర్‌కు వెళ్లింది. దాని మీది అడ్రస్‌తో వాళ్ళకూ సమస్య వచ్చి పడింది. వాళ్ళూ అస్సాం రాష్ట్రం అంతటా శోధించారు. కానీ ఎక్కడా నీతివంతుడి జాడలేదు. ఏమీ తోచకవాళ్ళు దాన్ని అక్షరక్రమంలో తరువాతిదైన ఉత్తరప్రదేశ్‌కి పంపారు. అక్కడా నీతిమంతుడి పత్తా లేదు.

ఈవిధంగా ఆ కవర్ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలూ తిరిగి తిరిగి మళ్లీ ఢిల్లీ పీయంటికి చేరింది. ఆయన దాన్ని పోస్టల్ శాఖామాత్యుడి దృష్టికి తీసుకెళ్లారు. కవర్‌మీది అడ్రస్ చూసిన మంత్రికి మతిపోయినంత పనైంది. కవర్‌మీద ఫ్రం అడ్రస్ లేదు. ఫ్రం అడ్రస్ కోసం మంత్రి సమక్షంలోనే కవర్ చించి చూశారు అధికారులు. ఆ కవర్‌లో 'ఫ్రం అవినీతిపరః, భారతదేశమ్' అని మాత్రమే ఉంది. అది రాసింది ఎవరో కూడా తెలుసుకోవడం కష్టమైంది అధికారులకు.

అప్పుడు మంత్రి సలహాదారుడు మంత్రితో "అవినీతిపరుడు, భారతదేశమ్' అనే ఫ్రం అడ్రస్‌తో ఒక కవర్ వచ్చింది. అందులో ఫ్రం అడ్రస్ వివరంగా లేదు. ఆ ఫ్రం అడ్రస్ దారుడు పూర్తి వివరాలతో లేఖరాస్తే అతనికి భారతప్రభుత్వం పదిలక్షల రూపాయలు బహుమతి ప్రకటించింది అని అన్ని మీడియాలలో ప్రకటిద్దాం సార్!" అని అన్నాడు.

సలహాదారుడి సలహా మేరకు టీవీల్లో, రేడియో, పేపర్లలో ప్రకటన వెలువడింది.

ఆ తర్వాత పోస్టల్ మంత్రిత్వశాఖకు వేలు కాదు, లక్షలు కాదు, కోట్ల సంఖ్యలో ఉత్తరాలు వచ్చాయి. వాటి అన్నిటిలో "ఆ అవినీతిపరుణ్ణి నేనే. నాకే ఆ పదిలక్షలరూపాయలు ఇవ్వండి" అని రాసి ఉంది. ఇన్ని కోట్లమందిలో ఎవరికి పదిలక్షల బహుమతి ఇవ్వాలో తెలీక మతికోల్పోయింది మంత్రిత్వశాఖ.

★